మందకొడిగా ఈ–క్రాప్..!


పంట వివరాల నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది, అధికారులు

- మారిన నిబంధనలతో వీఏఏలు అవస్థలు
- నియోజకవర్గంలో 22,981 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు
- ఈ–క్రాప్ నమోదుకు ఈ నెలాఖరు వరకు గడువు
- ఈ–క్రాప్ అయితేనే ప్రభుత్వ పథకాలు
- ధాన్యం విక్రయానికి ఇబ్బంది అవుతుందని రైతుల ఆందోళన

నరసన్నపేట: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలల పైనే అవుతోంది. రైతులకు అన్ని విధాలా ఉపయోగకరమైన పంట (ఈ– క్రాప్) నమోదు మాత్రం అనుకున్నట్లు సాగడం లేదు. నరసన్నపేట నియోజకవర్గంలో సెప్టెంబర్ 12వ తేదీ నాటికి 22,981 ఎకరాల్లోనే పంట నమోదైంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో వీఏఏలపై ఒత్తిడి చేస్తున్నారు. వీఏఏలకు పని ఒత్తిడి, కొత్తవారు కావడం, ఎరువుల పంపిణీతోపాటు కొన్ని నిబంధనలు మార్చడంతో అనుకున్నట్లుగా పంట నమోదు జరగడం లేదు. రైతుల మేలు కోసం గత ప్రభుత్వం ఈ–క్రాప్ నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. పంట నమోదు చేసుకున్న రైతులుకు ప్రభుత్వ పథకాలు అన్నింటినీ వర్తింపజేంసింది.

69,580 ఎకరాల్లో వివిధ పంటలు సాగు..

నియోజకవర్గంలో 69,580 ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతున్నాయి. ప్రధానంగా వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలు అనేకం ఉన్నాయి. వీటన్నింటినీ సెప్టెంబర్ 30వ తేదీ లోగా నమోదు చేయాలి. ఇంకా కేవలం 16 రోజులు సమయం ఉంది. ఈలోగా పూర్తి చేయాలని అధికారులు క్రింది స్థాయి సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్నారు. సకాలంలో పంట నమోదు జరుగుతుందా అన్న అనుమానం వ్యక్తం అవుతోంది. పంట నమోదు సక్రమంగా కాకపోతే పండిన ధాన్యం విక్రయాలకు ఇబ్బందులు వస్తాయి. ఎరువులు సక్రమంగా ఇవ్వకపోగా ధాన్యం విక్రయానికి ఇబ్బంది కలిగితే చావే శరణ్యమని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో (ఈ నెల 12వ తేదీ నాటికి) ఈ–క్రాప్ నమోదు వివరాలు

మండలం	మొత్తం విస్తీర్ణం	నమోదు చేసిన విస్తీర్ణం
నరసన్నపేట	16,819	6,627
జలుమూరు	18,271	5,739
పోలాకి	18,025	5,303
సారవకోట	16,465	5,321

మారిన నిబంధనలతో అవస్థలు

గత ఖరీఫ్ సీజన్‌తో పోల్చితే ఈ–క్రాప్ నమోదులో ఈ ఏడాది కొన్ని నిబంధనలను ప్రభుత్వం మార్చింది. గతంలో 200 మీటర్ల దూరం నుంచి ఈ–క్రాప్ నమోదుకు అవకాశం ఉండేది. ఇప్పుడు దీనిని 20 మీటర్లకు కుదించారు. విధిగా వీఏఏలు ప్రతీ కమతం దగ్గరకి వెళ్లి నమోదు చేయాల్సి వస్తోంది. 25 సెంట్లు లోపు ఉన్న కమతాల్లో ఈ–క్రాప్ నమోదు చేసేందుకు కమతం వద్దకు వెళ్లకపోయినా ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం ఉంటే అయిపోయేది. ఫొటో అప్‌లోడ్ తప్పనిసరిగా ఉండేదికాదు. ఇప్పుడు ఈ ఆప్షన్‌ను తొలగించారు. మరోపక్క యూరియా పంపిణీలో వీఏఏలు బిజీగా ఉండటంతో ఈ–క్రాప్ అనుకున్నంత ముందుకు సాగడంలేదు.

ఈ–క్రాప్ వలన ప్రయోజనాలు

ఈ–క్రాప్ నమోదును ప్రతి రైతూ చేయించుకోవాలి. ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల విక్రయానికి, అన్నదాత సుఖీభవ పథకానికి ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి. కౌలు రైతులుకు ప్రభుత్వ పథకాలు అందాలన్నా పంట నమోదు చేసుకోవాలి.

ఈ–క్రాప్ కాకపోతే రైతులకు నష్టం



ఈ–క్రాప్ సజావుగా జరగకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ప్రధానంగా ప్రభుత్వ పథకాలు మాట ఎలా ఉన్నా.. పండిన ధాన్యం విక్రయాలకు ఈ–క్రాప్ లింక్ కావడంతో రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

– కనపల శేఖరరావు, రైతు, పోతయ్యవలస

త్వరితగతిన పూర్తిచేయాలి



ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పూర్తిచేయాలి. దీంట్లో వీఏఏలు తగిన శ్రద్ధ చూపాలి. జాప్యం చేయడం, అలసత్వం వహించడం మంచిది కాదు. తమ పరిధిలోని అన్ని పంటలనూ నమోదు చేయాలి. మారిన నిబంధనలు గమనించి వీఏఏలు వేగవంతం చేయాలి. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు పంట నమోదు ప్రక్రియపై సమీక్ష చేస్తుండాలి.

– ఎల్.వి.మధు, ఏడీ, నరసన్నపేట

క్లుప్తంగా

పాతపట్నం ఎంపీడీఓగా తిరుపతి పట్నాయక్



పాతపట్నం: స్థానిక ఎంపీడీఓగా (ఇన్‌చార్జి) తిరుపతి పట్నాయక్ ఆదివారం నియమితులయ్యారు. ఈయన ఇక్కడ ఏఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన పి.చంద్రకుమారి ఉద్యోగోన్నతి బదిలీపై విజయనగరం జిల్లా గరివిడి ఏపీడీగా వెళ్లారు.

క్షేత్రసహాయకుల మండల కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గం

మెళియాపుట్టి: అందరూ సమష్టి కృషితో కలిసికట్టుగా పనిచేయాలని పలువురు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించి మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సనపల తిరుపతిరావు, ఉపాధ్యక్షుడిగా రాజు మజ్జి, కార్యదర్శిగా సిరిపురం జగదీశ్వరరావు, కోశాధికారిగా బొల్ల సింహాచలం, ఉపకోశాధికారిగా వనజాక్షి, ఐదుగురిని ఈసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. అందరూ సంఘం నిర్ణయం మేరకు కట్టుబడి పని చేస్తామని, ఎవరికి ఏ ఆపద వచ్చినా కలిసికట్టుగా సహకరిస్తామన్నారు. పోరాటాలు చేయాల్సిన సమయాలలో యూనియన్ పిలుపుమేరకు ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు లొడగల శ్రీనివాసరావు, ఈసీ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..


ఆనందరావును పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

సారవకోట: మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ఆదివారం పరామర్శించారు. బొంతు గ్రామానికి చెందిన బొంగు భారతమ్మ, కొత్తపేట గ్రామానికి చెందిన ఇరగట్టపు ఫల్గుణరావు, చిన్నకిట్టాలపాడుకు చెందిన పారశెల్లి ఆనందరావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారిని పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో సర్పంచ్‌లు జన్ని అనిరుద్రుడు, ఇసై షణ్ముఖరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, కాళ్ల సింహాచలం, బొంగు కొండయ్య, ధర్మాన జగన్, రంజిత్, జన్ని చినఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

210 మందికి ఆరోగ్య పరీక్షలు


విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నరసన్నపేట: మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో ఆదివారం 210 మంది విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ప్రసూతి, స్త్రీ వ్యాధుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో కౌమార దశ బాలికల్లో రక్తహీనత, తదితర సమస్యలను గుర్తించే పరీక్షలను నిర్వహించారు. ప్రతీ ఆదివారం ఇటువంటి పాఠశాలల్లో బాలికలకు పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలో ఆదివారం సత్రాం గ్రామానికి చెందిన త్రైత సిద్ధాంత భగవద్గీత కమిటీ సభ్యులు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా భగవద్గీత అందరికీ చేరువ కావాలనే ఉద్దేశంతోనే పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేద్దాం


ఆమదాలవలస:పదవులు పొందినవారితో చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ పటిష్టతకు పార్టీ శ్రేణులంతా కలిసి కృషి చేద్దామని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఆదేశాలతో పార్టీలో వివిధ వర్గాలకు చెందినవారికి పదవులను ప్రకటించారు. పదవులు పొందినవారికి ఆమదాలవలస పార్టీ కార్యాలయంలో ఆదివారం రవికుమార్ సత్కరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జనరల్ సెక్రటరీ గురుగుబెల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ సెక్రటరీ తమ్మినేని మురళి, రాష్ట్ర వీవర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీ కాలేపు శ్రీదేవి, ఆమదాలవలస నియోజకవర్గ ఆర్టిఫిషియల్ వింగ్ ప్రసిడెంట్ వీరస్వామి, జిల్లా యూత్‌వింగ్ జనరల్ సెక్రటరీ గండివలస పృథ్వీరాజ్, జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ దేవకోట ఈశ్వరరావు, జిల్లా మున్సిపల్ వింగ్ జనరల్ సెక్రటరీ సంపతరావు రామారావు, జిల్లా ఎస్సీ సెల్ సెక్రటరీ కలగాటి జాన్, జిల్లా ఎస్సీ సెల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముద్దాడ ఈశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ ఎం.ఉమాశంకర్‌ను అభినందించారు. పార్టీ వాలంటీర్ వింగ్ సెక్రటరీ అత్తులూరి రవికాంత్, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు ముడడ్ల రమణ, పార్టీ ముఖ్యనాయకులు జల్లు ఆదినారాయణ, మజ్జి నర్సింగరావు, బడ్డేపల్లి వెంకటసత్యం, కింజరాపు ఆదనంద్ పాల్గొన్నారు.


బూర్జ: గుమ్మడి రాంబాబును అభినందిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

గుమ్మడికి అభినందించిన

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామానికి చెందిన గుమ్మడి రాంబాబుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. మదనాపురంలో రాంబాబును పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆదివారం అభినందించారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, సర్పంచ్ జీడి వేణు, అత్తులూరి రవికాంత్, జల్లు బలరాంనాయుడు, మజ్జి నర్సింగరావు, నున్నగొప్పల రామకృష్ణ, కాగితాపల్లి జగన్, మజ్జి రాములు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక..



నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2008–10లో ఇంటర్మీడియెట్ చదివిన విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి కష్టసుఖాలు మరొకరు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏయే ఉద్యోగాలలో స్థిరపడ్డారో తెలుసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు.

– నరసన్నపేట

పనిచేయని ఏటీఎం..!



సారవకోట మండలంలోని బుడితి పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన డీసీసీబీ ఏటీఎం పనిచేయడం లేదు. ఈ గ్రామంలో పీఏసీఎస్ సేవలు బాగా ఉన్నప్పటికీ ఏటీఎం సేవలు గత కొన్ని నెలలుగా అందడం లేదు. డీసీసీబీ అధికారులు ప్రజలకు, రైతులుకు తమ సేవలను చేరువ చేస్తున్నామని చెబుతున్నారే తప్ప.. గ్రామస్థాయిలో ఆ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని చెప్పడానికి ఇదే నిదర్శనం.

– సారవకోట

పది అడుగుల పాము హతం



ఎల్.ఎన్.పేట మండలం సరడాం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో పది అడుగుల కోబ్రా పామును రైతులు హతమార్చారు. ఆదివారం ఉదయం పొలం పనులకు రైతులు వెళ్తుండగా పాము బుసలు కొట్టింది. ఇలాంటి పామును తాము ఎప్పుడూ చూడలేదని రైతులంటున్నారు. పామును రైతులు హతమార్చారు.

– హిరమండలం

దారి చూపండి..



ఈ చిత్రం ఆమదాలవలస మండలంలోని కనుగులవలస నుంచి చింతాడకు వేళ్లే దారి. చెరువు గట్టుపైనే రాకపోకలు సాగిస్తూ కనుగులవలసతోపాటు పలు గ్రామాల ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రతీ శనివారం చింతాడ గ్రామంలో వారపు సంత కూడా జరుగుతోంది. ఇప్పటికైనా పాలకులు చెరువుగట్టుపై నుంచి రహదారి నిర్మాణం చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

వైద్యాన్ని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, వైఎస్సీర్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి గంధవరపు నాగేంద్ర, సర్పంచ్ ధర్మారావు అన్నారు. మండలంలోని మెట్టూరులో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. రోగులకు వైద్యం అందివ్వకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. దీంతో పలువురు రోగులు మృత్యువాత పడుతున్నారన్నారు. మండలంలోని మెట్టూరు గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పీహెచ్‌సీని మంజూరు చేసిందన్నారు. భవన నిర్మాణం కోసం రూ.3 కోట్లు, ఎకరం భూమి కేటాయించిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తయినా ఇంతవరకు పీహెచ్‌సీ నిర్మాణం చేపట్టలేదన్నారు. పీహెచ్‌సీ ఉన్నా రోగులకు ఉపయోగం లేకుండా పోయిందన్నారు. కొత్తూరు సీహెచ్‌సీలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎనిమిది మంది వైద్యులను నియమించిదన్నారు. నేడు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కూటమి నేతలు పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తిర్లంగి కృష్ణమోహన్, బరాటం నరసింహం, రైతు విభాగం నాయకుడు మతం పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న యూరియా


బందారు జైప్రతాప్‌కుమార్

పొందూరు: రైతుల సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బందారు జైప్రతాప్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎరువుల సరఫరాలో బ్లాక్ మార్కెట్ పెరిగిందని, రైతులు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంన్నాయుడు జిల్లాకు చెందిన వారైనప్పటికీ జిల్లాలోని రైతులు యూరియా అందించడంలో విఫలమయ్యారన్నారు. నూతనంగా బీజేపీకి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతుల చేపట్టిన పీవీఎన్ మాధవ్‌కు రైతుల కష్టాలు కనిపించటం లేదా అని ప్రశ్నించారు. ఈ పరిస్థితి నుంచి రైతులను గట్టెక్కించాలని అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు.

రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మండల కేంద్రంలోని మారుతీనగర్‌లో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ బి.శంకర్ ఆదివారం భూమి పూజచేశారు. రోడ్డుతోపాటు డ్రైనేజీని నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

230 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

హిరమండలం: ఎల్.ఎన్.పేటలోని ఎంపీపీఎస్ స్కూల్ ఆవరణలో సత్యసాయిబాబా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ వైద్యులు, సిబ్బంది రోహిత్, ప్రవల్లిక, రిషిత, అర్జున్ దుర్గ, షన్ముఖ పాల్గొని 230 మందికి వైద్య సేవలందించి మందులు అందించారు. 35 మందికి ఉన్నత వైద్యానికి కిమ్స్‌కు రిఫర్ చేశారు. మేనేజర్ సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దళిత విస్తృత స్థాయి సమావేశానికి ఆహ్వానం


తమ్మినేనికి ఆహ్వానం పలుకుతున్న పొన్నాడ రుషి

ఆమదాలవలస: ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న దళిత విస్తృత స్థాయి సమావేశానికి మాజీ స్పీకర్, వైస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయల వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాంను ఆయన నివాసం వద్ద పార్టీ దళిత నాయకులు ఆదివారం కలిసి ఆహ్వానించారు. తమ్మినేనిని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నాడ రుషి ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. శ్రీకాకుళం పట్టణంలో గల 80 అడుగుల రోడ్‌లో ఉన్న బృందావనం కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా దళితులంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. రాష్ట్ర, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఉన్నారు.